# అకాయ్ చేసిన పెళ్లి

రామారావుది బ్రతికి చెడిన కుటుంబం - ఆ నొప్పి అనుభవించిన వారికే తెలుః

భార్య శారదఅన్నపూర్ణాదేవి. ఒకప్పుడు ఆ యిల్లు నిత్యాన్నదాన సత్రం. వుదయం లేచింది మొదలు పేదసాదా, అతిథీ అభ్యాగతులంటూ ఎక్కే తప్పాల ఎక్కుతూ వుంటే, దిగే గుండీ దిగుతూ వుండేది. అలాంటి ఆ మహానసంలో ఇప్పుడు నలుగురికి సరిపడే అత్తెసరు గిన్నె నిండుగా వండడానికి, సరిపడే బియ్యానికే కష్టంగా వుంది.

రామారావు తండ్రిగారు నాల్గాళ్ళు కరణీకం చేస్తూ కొడుకును భవంతుల్లో అస్మాన్ గిరీ అలంకరించిన వెండి గిలకల వుయ్యాలల్లో వూపాడు. అందరు తండ్రుల్లానే రామారావు తండ్రి కూడా తన కొడుకు ప్రయోజకుడై నాల్గింటికి రెట్టింపు వూళ్లను కరణంగా ఎల్తాడంటూ కలలు కన్నాడు. కాని ఆయన కలలు పగటి కలలయ్యాయి.

రామారావు నీతిమంతుడు, విద్యావంతుడు, బుద్ధిమంతుడు అయినా ఆయన లౌకిక తంత్రాలకు నీళ్లువిడిచి, వూళ్లో పిల్లలకు సంస్కృత పాఠాలు చెప్పుతూ సంసారం సాగించే స్థితికి దిగాడు. విచిత్రంగా వో పదేళ్లలో ఆ ఇల్లు కరిమింగిన వెలగపండై డొల్లగా మారింది. అయినా పూర్వపుణ్యంతో లభించిన భార్య సోమి దమ్మలా ఆ యింటికి ధర్మరక్ష కవచమై నిలిచింది. కానీ, ఆమె మారిన పరిస్థితుల్లో శుక్తిలో కాక, కొలిమిలో పడ్డ నీటిచుక్కలా అణగారి పోతుందో? ఏమో? అని రామారావు లోలోపల కుములుతుంటాడు. కానీ, ఏం చేస్తాడు? పాపం!

రామారావుకు ఎదిగిన ఇద్దరాడ పిల్లలు, చెయ్యెత్తు కొడుకు. వీళ్లనం చూచినప్పుడల్లా శారద తండ్రికి వినిపించేలా మరీ అవసరాన్ని మించి ఆయాసంగా నిట్టూరుస్తుంది.

ఆగాలిలో రామారావు ఎదకుంపటి బాగా రాజుకుని ప్రచండంగా జ్వలిస్తుంది. అవేడిని తట్టుకోలేక, 'కర్మణ్యేవాధికారస్తే' అంటూ గీతాపారాయణంలో చల్లదనాన్ని

వెతుక్కోవటం ప్రారంభిస్తాడు. చేసేదిలేక శారదమ్మ చెంపలేసుకుని మడి కట్టుకోవటాని కంటూ వెళ్లిపోతుంది.

ఈ మధ్యలో రామారావు పూలమ్మిన చోట కట్టెలమ్మ లేక పిల్లల చదువంటూ గత వైభవానికి చిహ్నంగా వీరుడిలా తల ఎత్తుకు నిల్చిన భవంతిని వదిలి నగరంలో మూడు గదుల అద్దెకొంపలో వుంటున్నాడు.

ఆ భవంతిని అమ్మితే తవం బాధలు గట్టెక్కుతాయనుకున్నాడు. కానీ కొనేవాడెవడు? ధరకు కాకుండా పుత్తపుణ్యానికిచ్చినా, దాన్ని వూడ్చి చల్లేందుకు నలుగురు పనికత్తెలు కావాలి. వారికి ముప్పూటలా తిండి పెట్టి మూడేసి నందలు ఇవ్వాల్సి వస్తుంది. వెల్ల ఏనుగులాంటి ఆ ఇంటిని వుత్త దండుగ అంటూ ఎవ్వరూ కొనరు.

దానికి ఇప్పుడు 'దయ్యాల ఇల్లు' అనే ఖితాబు కూడా దొరికింది. పాపం గ్రామ పంచాయతీ పెద్దలు రామారావు గారి మంచి తనాన్ని మన్నిస్తూ 'యజమాని, ఇంటి రుసుము చెల్లిస్తూ వుంటే 'అందరికీ చదువు' కింద మేం ఈ ఇంటిని రాత్రి బడికింద తీసుకుంటాం' అంటూ ఎంతో కనికరంతో సానుభూతిని ప్రకటిస్తూ అభయహస్తం ఇచ్చారు.

తండ్రి ఆజ్ఞ మేరకు భవంతి అమ్మకానికోసం ఊరెళ్లి, ఆ వార్త విన్న రామారావుగారి కొడుకు సుందర్రావు బరువు గుండెలతో తిరిగి వస్తూ వుంటె, నగరపు శివార్లలో విచిత్రమైన బోర్డు కనిపించింది. దానిపై 'అక్కాయిని కొనండి - చెల్లాయిని తీసుకెళ్లండి' అంటూ రాసి వుంది. పరధ్యానంలో వున్న సుందరానికి అది వ్యాపారప్రకటనగా భాసించలేదు. జీవితాన్ని కుతకుత వుడికిస్తూ నికృష్ట స్థితికి దిగజార్చిన పేదరికపు వికట అట్టహాసంగా గోచరించింది. ఆ ప్రకటన చదివిన సుందరానికి ఎవరో కడుపులో సురియలు తిప్పుతున్నట్లైంది. కసితో, మంటతో పొగలు కక్కాడు. అతనిలో ఇరవై అయిదేళ్ల పడుచుతనం వెనకకొదిగి అరవై తొణికిన ఆడపిల్లల తండ్రి తనం నిండుగా తొంగి చూచింది. ఇప్పుడు సుందరానికి గుండెలు పేదవడి మృదులమయ్యాయి. సైకిల్ తొక్కుతూనే ఆలోచిస్తున్నాడు. పేదరికం చేయంది ఏముందని ? ''బుభుక్షుః కింనకరోతి పాపం'' ? అన్నారు పెద్దలు; ఇలాంటి పరిస్థితులే నేమో? వ్యక్తి చేత పాపాలు చేయించేది? అవును మరి 'మర్తాక్యానహికర్తా' కాకపోతే ? తండ్రే స్వయంగా ఇలాంటి ప్రకటనలు నడిబజారులో వేయిస్తాడా ?

కాలదోషం పట్టిన 'కన్యాశుల్కం' మళ్లా వికట రూపంతో తల ఎత్తుతుందా? పాపం కన్నకూతుళ్లే బరువైనట్లున్నారు. వరకట్నం హాట్, హాట్గా, జోరుగా షోకులు పోతున్న ఈ కాలంలో పిల్లను, డబ్బిచ్చి ఎవడు కొంటాడు? పైగా మెడకో 'గుదిబండలా' మరో చిన్నదాన్ని కొస రేస్తానంటున్నాడు. ఆడపిల్లల దైన్యస్థితికి గుండె ద్రవించింది.

'ఈ కుటుంబి ఎవరో? మా నాన్నను మించిన వారులా వున్నారు. పాపం! తండ్రి ఎవరో ? నేను కలుసుకుంటే బావుణ్ణు' అంటూ పసరు కోరిక రెమ్మ వేసింది. వుద్రేకించిన యౌవనంలో- అంతలోకే ఛీ, ఛీ, నేనెంత మూర్ఖుణ్ణి, నాయింట్లో ఎదిగిన చెల్లాయిల చేతులు

ఎ(ర్రచేయడానికి మా నాన్న అహోరాత్రులు మథనపడుతూ వుంటే ఆ బాధ్యతలన్నీ దులపరించుకుని ఆ పిల్లల తండ్రిని వుద్ధరిస్తాననుకుంటున్నాను. నన్ను, నేనేదో గొప్ప సంఘసంస్కర్తగా భావించుకుంటున్నాను.

ఇది సంఘసంస్కర్త లక్షణం కాదు. నాలో పురుషుడు నూనూగు మీసపు పులకల వేడిలో కన్యా సంబంధి ఐన వాంఛకు తావిస్తున్నాడు. 'అయ్యో! పేదరికానికి కోరికలెక్కువ, కరువుకు ఆకలెక్కువ' అన్నట్లు మా నాన్న తర్ఫీదులో కరుణాపేశలమైన నా ఎద శృంగార రసలోలుపమౌతుందేమిటీ? అసంగతంగా లేదూ? ఛా, ఛా, శృంగారమా? చట్టుబండలా? భావం అభిరామ రూపైక పాతుకం కదా? అక్కడ ఆశ్రయమే లేంది చిత్తం ఎట్లా అపదార్థంపై వాలుతుంది? ఛట్ !

ఇదంతా మా ఇం దాపురించిన అభిశాపంవల్లా, నా చేతగాని తనంవల్లా, నిరీహవల్లా ఏర్పడ్డ చిత్తభ్రమణం తప్ప మరేమీ కాదు 'తనకు కాని దయ్యం వూరులకు వరాలిస్తాడా? మేం నలుగురిలో పరువుగా బ్రతికేందుకోసమే అమ్మకు తెలియకుండా, నాన్నకు తెలిసీ తెలియనట్లుగా గుట్టుగా గంభీరంగా జీవయాత్ర సాగిస్తున్నాం. ఇంతే తప్ప ఇతర్ల గూర్చి ఆలోచించే తీరికా, వెసలు బాటూ, భాగ్యాలు ఎక్కడివి ? నేనెక్కడా? పరోపకారం ఏవూరు? అంటూ మనస్సును పగ్గాలతో బంధించి, మళ్లా ఆ వైపు చూడకుండా తన ఇంటి దారి పట్టి వెళ్లిపోయాడు.

ఇంటికి వచ్చీరాగానే తల్లి 'ఏం నాయనా! ముఖవంతా వాడిపోయింది? స్నానం చేసి సంధ్య వార్చుకో' వడ్డిస్తాను' అంది. ఆమె ఏది మరిచినా ఉభయ సంధ్యల్లో ఏ పొర పొచ్చెం రాకుండా కాపాడటం మాత్రం మరిచిపోదు. అది విన్న ఆడపిల్లలు 'అదేంటే? అమ్మా! నీది మరీ చాదస్తం కాకపోతే? ఈ అణుయుగంలో కాలం విలువ తెలియకుండా పొద్దస్తమానం జపతపాలంటూ కూర్చుంటే అవతల పను లెలా వెలిగిస్తాం? అందుకే ఈ దారిద్ర్యంలో ఇలా కూరుకుపోతున్నాం' అంటూ పోటుమాటలతో చురకల్లా చురచురమనిపించారు.

నిజానికి జయాసుధలిద్దరూ కావాలనీ తల్లీ తండ్రిని బాధించాలని అనలేదు. ఏదో! ఎండపడివచ్చిన అన్న పక్షం వహిస్తూ మమూలుగా అన్న మాటలవి. కానీ అవి తగలవలసిన చోట తగిలి పచ్చి ఎదలను నెత్తురు వోడిచేట్టు చేసాయి.

దీంతో అందరూ అవాక్కై పోయారు. రామారావుగారు 'నిష్కర్మకన్నా చావు మేలు' అనే సూక్తిని కాస్త గట్టిగానే అన్నట్లున్నారు కానీ, పంచపాత్రా, ఉద్ధరణ్యాది పరికరాలను తొలిచి శుద్ధి చేస్తూ 'శుద్ధబ్రహ్మ!' నామజపం చేస్తున్న శారదమ్మ హడావిడిలో ఈ, ఆ మాటలేవీ ఎవరికీ వినిపించలేదు, ఎవరూ వినాలని అనుకోనూ లేదు. ఇంతకు సుందరం వూరెళ్లిన పని ఏమైంది? ఇంటికి ఏమైనా ధర పలికిందా? అయితే ఏ మాత్రంలో వుంటుంది. అంటూ అడగాలని తల్లి తాపత్రయపడింది. కానీ ఎందుకో ఎర్రగ కందగడ్డలా కందిన కొడుకు ముఖాన్ని చూస్తూ అడిగే ధైర్యం చాలక అదగలేకపోయింది.

చెప్పకే చెప్పిన సుందరం వాలకాన్ని గ్రహించిన రామారావు వృథాప్రయాస ఎందుకంటూ విరమించుకున్నాడు. పాపం! సుధా, జయలు (చెల్లెళ్లు) మాత్రం ఆ యింటి విలువను పది లాకారాల్లో కనీసంగా లెక్కవేసుకుని రేపు తాము కొనబోయే కలర్ టి.వీ. ట్రాన్సిస్టర్' పంజాబ్ డ్రెస్‌లతో పాటు పి.జిలో ప్రవేశించడానికి కలలు కంటూ ఆలస్యంగా నిద్రలోకి జారబడ్డారు.

సుందరానికి నిద్రపట్టడం లేదు, తనపై తనకే, కసిగా వుంది. ఏదో అఘాయిత్యం చేయాలనుకున్నాడు. అమ్మానాన్నలను కడసారి చూడాలనుకున్నాడు. ఆ గదికేసి వెళుతూ వుంటే ఎడమవైపు చెల్లెళ్లిద్దరూ మధుర స్వప్నాలు కంటూ పసిపిల్లల్లా నిద్రపోతూ కనిపించారు. కిటికీలోంచి వచ్చే చంద్రకాంతులు ముఖాలపై పడుతూ వుంటే చెల్లెళ్లు దేవలోకపు అప్సరస కన్యల్లా కనిపిస్తున్నారు. వాళ్లు కంటపడగానే తన నిర్ణయం అతుకుల నిచ్చెనలా వూగిసలాడింది.

'నా చెల్లెళ్లకేం తక్కువ? వరులెందుకు రారు? వస్తారు. 'నరత్నమన్విష్యతే మృగ్యతేహితత్' అన్నాడు కదా కాళిదాసు. అంటాడు. అనకేం జేస్తాడు? కడుపునిండిన కవి, ఆయన ప్రజాకవి అయితే గదా? ప్రజల కష్టసుఖాలు తెలిసివచ్చేది? చచ్చిన మన్మథుణ్ణి పార్వతమ్మ వొయ్యారాలతో పునర్జీవితుణ్ణి చేసి ఆరవిరినే అయిదవ బాణంగా మలిచి పాపం సన్యాసిని సంసారిగా తీర్చిన క్యాపిటలిస్టిక్ యాండ్ ది మోస్ట్ డియర్లీ హేటెడ్ రాజరికపు రంగులకవి.

నిజంగా కవి అంటే అతడే 'చంద్రునికున్న గుణ సంఘాతాల్లో మచ్చ ఒక్కటే దోషం, కాని దరిద్రతా దోషం కవికి కనిపించలేదా? అంటూ వాపోయాడే ఆయనే ప్రజల జీవనాడిని పట్టినవాడు. అమ్మబాబోయ్! నేనేదో ఇప్పటి ' ఇజాలల్లో' చేరిపోతూ లేను కదా? ఛా, అవేం ? మాటలూ? మా నాన్నా అమ్మల తలాల నాటి సంస్కారం నా నరనరాల్లో ప్రవహిస్తూ వుంటే నా మనస్సుకు తిరుగుబాటు కూడానా? ఏదో ఇది క్షణిక చాపల్యం - పైత్యపు వికారం అంతే!

ఇప్పటికీ ఈ ఆత్మహత్యా ప్రయత్నానికి వీడుకోలు 'మెదడు మాగాణిలాంటిది దాన్ని బాగా దున్ని గట్టి విత్తనం వేస్తే పంటపుష్కలంగా రాల్చకేం జేస్తుంది? అంతేకాదు ' ఊట చెలిమె' లా ఎప్పటికప్పుడు కొంచెం పెళ్లగిస్తే చాలు జొట జొట నీరుబికినట్లు కొత్త కొత్త ఆలోచనలనూ భూమికలనూ నిర్మాణం చేస్తుంది.

'నా బంగారు చెల్లెళ్ల భవిష్యత్తుకోసమైనా జీవించాలి' అంటూ తిరిగి తన మంచం పైకి వచ్చి శరీరం వాల్చాడు. మేనైతే వాల్చాడు కాని నిద్రవొస్తేగా? మరీ మరీ తన కళ్లముందు ఆ బోర్డుపై అక్షరాలే గుర్తుకొస్తూ తనను ఆలోచింప చేస్తున్నాయి. చివరకు ఏదో బౌద్ధికంగా జాగృతి నర్తించినట్లు, తనను తట్టి మేల్కొలుపుతున్నట్లు, నిరీహనంతా తొలగిస్తూ ఏదో నూతన చైతన్యం తనకు హుషారు నింపుతూ వుంటే బిసతిప్పిన బొమ్మలా లేచి కూర్చున్నాడు. సుందరం లేచిన వెంటనే కాగితం కలం తీసుకుని తాను వో స్లోగన్ సృష్టించాడు.

'అన్నాయిని కొనండి - చెల్లాయిని తీసుకెళ్లండి' రిథమ్ బేషుగ్గా కుదిరింది. సృష్టికన్నా ప్రతిసృష్టి మెరుగు కదా! ఈ స్లోగన్ దేశకాలాదులకు కూడా సరిపోతుంది. మా నాన్నగారు నోరు తెరిచి ఇంతా! అంతా! అంటూ అడక్కుండానే నాకు ధర పల్కుతుంది. అఫ్‌కోర్సు గిట్టుబాటు ధరా, అదీ మా అమ్మగారు చూసుకుంటారు. వరకట్నం అడిగాం, ఇచ్చాం అన్న అపవాదే వుండదు. - అంతా చమత్కారం!

'ఇంకేం? రాజమార్గంగా వో వస్తువునై అంగడి కెక్కుతాను. నాకు కాబోయే: మామగారో? బావమరిదిగారో? నన్ను కొంటారు. నా చెల్లిని తీసుకెళ్లుతారు అంటే నా ధరలో, నా చెల్లికి ఇచ్చే కట్నం వగైరాలు కలిసే వుంటాయని ఇంగితజ్ఞులు గ్రహించకపోతారా? అంటూ మహా హుషారుగా చిన్న పిల్లవాడిలా మంచంపైనే దొమ్మరిగడలేశాడు. అయినా వుల్లాసం శమించలేదు. తనవారితో పంచుకోవాలి అనుకున్నాడు. పడుకున్న చెల్లెళ్లను లేపాడు. ఆ అలికిడికి తల్లీ లేచింది. తండ్రీ లేచాడు. 'కోళ్ల కొక్కొరోకో' అంటూ రెక్కలు విదిల్చాయి. అందరూ పనులన్నీ త్వరత్వరగా ముగించుకున్నారు. తల్లి కాఫీ చేసి ముగ్గురు పిల్లకూ యిచ్చింది. చాలా కాలంగా లేని ఈ పండుగ వాతావరణాన్ని చూచిన తల్లి మురిసిపోయింది. ఏ అంతూ చిక్కనిది తండ్రికి మాత్రమే.

పదిగంటలకల్లా తీర్చిన అక్షరాలతో అలంకృతమైన బోర్డు పెళ్లికూతురిలా సింగారించుకుని సిద్ధమైంది. ఎలావుంది నాన్నా? అంటూ తండ్రికి చూపాడు సుందరం. తొలుత తండ్రికేం అంతుపట్టలేదు కానీ తరతరాలుగా విషయం అంతా అరటి పండు వొలిచినట్లు అవగతం అయింగి. సుందరాన్ని చూస్తూ 'వోహో'! చివరకు నీవు వేసిన ఎత్తుగడ ఇదట్రా? సరే! నీవు మగవాడివి? నీకేలోటూ రాదు, ఆడపిల్లలు వో ఇంటివారైతే చాలు, అయినా మన భాగ్యవిశేషం ఎలా వుందో? అంటూన్న మాటలు విన్న శారద తడిచేతులు చీరకొంగుకు తుడుచుకుంటూ వచ్చి -

'మన భాగ్యానికేవండీ? బహు సుముఖంగా వుంది, తల్లికి పుష్పాలంకరణ చేస్తూ వుంటే అమాంతం వో పువ్వొచ్చి నా వొళ్లో పడింది. ఆ విషయం చెబుదామనే వచ్చాను. అంటూంటే ఇరవై సంవత్సరాలనాటి సిగ్గరితనం, శారద కళ్లలోని మెరుపులు మళ్లా ఈనాడు కన్పించాయి. అది చూసిన రామారావు శ్రీనివాసా! నీ దివ్యలీల తండ్రీ! అన్నాడు.

ఈ కొత్త అడ్వర్‌టైజ్‌మెంట్ బోర్డు జనాన్ని తండోప తండాలుగా ఆకర్షించడం ప్రారంభించింది. ఆ బోర్డు చూడ్డానికి ఎగబడ్డవారంతా 'అరే, మనం చూడని వస్తువును గూర్చి ఎలా బాగోగులు నిర్ణయించడం? ఈ అన్నాయ్ ఏ కంపెనీదో? ఎలా పని చేస్తుందో? పేరు మాత్రం జపాన్‌లా ధ్వనించడం లేదు. ఏదో స్విస్ కంపెనీ కావచ్చు, లేదా రష్యాదై వుంటుంది.

ఇది ఇంతకు టూ- ఇన్-వన్నా? కాక టి.వీయా? ఏదీ తేలడం లేదే? ఈ మహానుభావుడు బోర్డైతే పెట్టాడు కాని ఏ షాపో, ఏ షో రూమో? ఏదో? అడ్రసు గట్రా ఏదీ ఇవ్వలేదు, అంటూ వెళ్లిపోతున్నారు.

ఆ మాటలు వింటూన్న తండ్రీకొడుకులు ఇద్దరికీ మతులు పోతున్నాయి. అయ్యయ్యో భగవంతుడా! ఇది 'అకాయ్' అమ్మకాలకోసం చేసిన వ్యాపార ప్రకటన అంటూ తెలియక, ఉన్న కాస్త బుద్ధికి స్వస్తి చెప్పి, భూతద్దంలో విషయాన్ని చూస్తూ చిరిగిన చాపకు చిల్లులు పొడిచామే తప్ప సాధించిందేమీ లేదంటూ కుమిలిపోయారు.

ఓ నెల రోజుల తరువాత వో పెద్ద మనిషి బిళ్ల గోచితో, ముఖాన తీర్చిన చాదుముక్కతో, జరీకండువా కప్పుకుని మణిశలాకలా వున్న ఆడపిల్లనూ, స్ఫురద్రూపులైన ఇద్దరు మగపిల్లలను వెంటపెట్టుకుని, రామారావు గారున్నారా? అంటూ తలుపు తట్టాడు.

తలుపు తెరచిన రామారావు గారిని చూచి లోన ప్రవేశిస్తూ ఆ పెద్దమనిషి అయ్యా! మీరు కొనుగోలుకు పెట్టిన అన్నాయనీ వెంట తీసుకెళ్లాల్సిన చెల్లాయినీ వో మారు చూపిస్తే, మాకు నచ్చితే మీ అన్నాయిని తప్పకుండా కొంటాం అన్నాడు.

వెంట వున్న ఆడపిల్లను చూచిన శారదమ్మ వెంటనే ఇవతలికొచ్చి 'రా తల్లి కూర్చుందువు కానీ అంటూ ఆప్యాయంగా ఆహ్వానించి, జయా, సుధలను రమ్మంటూ కేక వేసింది. ఈ కేక విన్న సుందరంకూడా పరుగెత్తుకొచ్చాడు. సుందరం ఇవతలికి వచ్చేసరికి రామారావు తప్పు చేసిన వాడిలా ముఖంపెట్టి - ఆ పెద్ద మనిషి ప్రశ్నకు సమాధానంగా -

'మహాప్రభూ! తమరెవరో? సంప్రదాయజ్ఞులైన సంపన్నుల్లా వున్నారు. ఈ ప్రకటనలో సూచితమైన 'అన్నాయి' టేపు రికార్డర్ గానీ టి.వి. కానీ కాదండి. అదేదో అక్కాయిని కొని చెల్లాయిని తీసుకెళ్లండీ అనే ప్రకటనతో స్పందించి, ఈ వాక్యాన్ని వో దౌర్భాగ్యుడైన తండ్రి ధ్వని గర్భితంగా ప్రకటితం చేసిన మొరగా భావించి, దాదాపు ఆ దశలోనే పయనిస్తున్న తన చెల్లెళ్ల పెళ్లికోసం తాను వో వస్తువుగా మారిన ప్రకటనండి బాబూ! మూల్గే వాడి తలపై తాటి పండులా ఈ కొత్త వుపద్రవం దాపురించింది. పెద్దవారికి శ్రమ ఇచ్చాను క్షంతవ్యుణ్ణి అన్నాడు.

ఆ మాటలు విన్న పరంధామయ్య అంటే వచ్చిన పెద్దమనిషి నవ్వుతూ, అంటే ఆ అన్నాయ్ మీ సుపుత్రుడు సుందరం అన్నమాట. సరే అన్నాయ్ నచ్చాడు. అడిగిన ధర కట్టి కొంటాను. అయితే అన్నాయి వెంట ఒక చెల్లాయ్ కాదండోయ్! మాది మాకే అప్పచెప్పడం న్యాయం కాదు. నాకు ఇద్దరు చెల్లాయిలూ కావాలి, సుమా! నాకు ఇద్దరు కొడుకులు కదూ చెప్ప మరిచాను. ఇక నేను 'అక్కాయి' మా లక్ష్మిని అమ్ముకోను, వరపూజ చెయ్యనివ్వండి. అన్నాడు.

ఈ మాటలు వింటున్న జయ సుధలు సిగ్గుల మొగ్గలై చెంపల్లో కెంపులు మెరిపించారు. మగపిల్లలు ఏం తోచక చేతి గుడ్డలతో చెమటలు తుడ్చుకుంటూ సుందరం బావగారూ! మీరేం చేస్తుంటారు అన్నారు. ఆ మాట విన్న లక్ష్మి కిసుక్కుమంటూ ఆ గదిని ముత్తెపు జల్లుతో తడిపింది.

సుందరం సమాధానం కోసం వెదుక్కుంటున్నాడు. శారదమ్మ సరాసరి దేవుడి ఇంట్లోకి వెళ్లి అమ్మవారి ముందు తల్లీ! అంటూ సాగిలపడింది.

చాలాసేపటికి తేరుకున్న రామారావుగారు అయ్యా! నేను వింటున్నది నిజమేనా? నేనిప్పుడు కటిక దరిద్రంలో వున్నాను. ఒకప్పుడు మాది నాలుగూళ్లవతను, నవాబుల దేవుడీలను తలదన్నే భవంతి. నౌకర్లకూ చాకర్లకూ కొదువలేదు. ఇప్పుడు గతం నాటి ముద్రలు తప్ప ఏ భుజకీర్తులూ లేవు, చివరకు సిగ్గువిడిచి అబ్బాయిని అంగట్లో పెట్టడానికి సిద్ధపడ్డ మూర్ఖుణ్ణి, నాకు కలలో భక్ష్యాలు తినిపించకండి. ఎదిగిన పిల్లలు తియ్యటి వూహలు నింపుకుని నిజం కాక పోతే భరించలేరు. మీ చెల్లాయ్ తట్టుకోలేదు. అంటూ రామారావు కళ్లనీళ్లు పెట్టుకున్నాడు.

పరందామయ్య స్మితంగా నవ్వుతూ 'భావగారు! మా పిల్లల గూర్చి మీకు సందేహం వద్దు. ఒకడు కంప్యూటర్ ఇంజనీయర్, రెండోవాడు సాఫ్ట్‌వేర్‌లో దిట్ట, ఆ చిలిపే ఆకర్షకంగా వుంటుందని ఆ స్లోగన్ క్రియేట్ చేశాడు. మా లక్ష్మి ఆర్ట్స్ గ్రాడ్యుయేట్ సంస్కృతంలో మంచి పరిజ్ఞానం వున్నది.

ఇక మా వంశం - ఆ వంచవారు, జమిందారీ కుటుంబమే, మీరు మాకు మేనత్తగారి వైపునుండి బంధువులు - మాకు కావలసింది ఆస్తి, డబ్బు కాదు, మీ వంశ ప్రతిష్ఠ, చితికిపోయిన మీ వంశ సముద్ధరణం అన్నాడు. ఆమాట విన్న రామారావుగారు ఎగిరి గంతేసినట్లు లేస్తూ 'శారదా అమ్మాయిలను లోపలికి తీసుకెళ్లు, బావగారూ, కోడలూ, అల్లుళ్లూ అంతా ఇక్కడే భోం చేస్తారు' అన్నాడు.

నెలతిరగగానే ఊరి భవంతిలో వివాహ మంగళ వాద్యాలు మ్రోగాయి.